సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం | 18 | ఫిబ్రవరి | 2023



నిర్వాసితుల సంతోషమే.. ప్రభుత్వానికి తృప్తి

అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన నిర్వాసితుల సంతోషమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసకుంటోందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. - 8లో



ఇ-క్రాప్ నమోదు పక్కాగా చేయాలి

రైతు పండించే పంటలకు ఇ-క్రాప్ నమోదు పక్కాగా చేయాల్సిందేనని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తేల్చిచెప్పారు. - 8లో



మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ రామస్వామి దేవస్థానంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

మహాశివరాత్రికి పటిష్ట భద్రత



- ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

పార్వతీపురంటౌన్: మహాశివరాత్రి పర్వదినాన జిల్లాలోని ప్రధాన ఆలయాల వద్ద 400 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేస్తామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యమిస్తూనే శైవక్షేత్రాల దర్శనానికి వీవీపీలకు కొంత సమయం కేటాయిస్తామన్నారు. ఊరేగింపు సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. వాహనాల పార్కింగ్, దారి మళ్లింపు ఉన్న ప్రతి చోటా సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ఎంట్రీ, ఎగ్జిట్ గేటుల వద్ద భక్తులకు సమాచారం పూర్తిగా తెలిసేలా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆలయాలకు విచ్చేసే భక్తులు వారివారి విలువైన వస్తువులు, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు.

స్థానికులకు ఉపాధి చూపండి



వై.వి.సుబ్బారెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ రూరల్: సీతంపేటలో నిర్మాణదశలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదే మండలానికి చెందిన స్థానికులకు జీవనోపాధి కల్పించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిను కోరారు. విజయనగరంలో ఓ కార్యక్రమానికి శుక్రవారం హాజరైన టీటీడీ చైర్మన్‌ను కలిసి పాలకొండలోని పలు ఆలయాల అభివృద్ధిపై చర్చించారు.సీతంపేట మండలానికి చెందిన నాయీబ్రాహ్మణులకు అక్కడ నిర్మిస్తున్న వేంకటేశ్వరుని ఆలయంలో మంగళ వాయిద్యాకారులుగా, కేశఖండనశాలలో విధుల నిర్వహణకు అవకాశం కల్పించాలని కోరారు.

బాలికల ఆరోగ్యంపై సర్వే



రెల్ల గ్రామంలో సర్వేచేస్తున్న పరిశోధకుడు రమణ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి, ఎగువ తాడికొండ, చెముడుగూడ, రెల్ల, లుంబేసు గిరిజన గ్రామాల్లో ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిశోధకుడు వై.రమణ శుక్రవారం పర్యటించారు. వాతావరణ దుర్బలత్వము ఉన్న ప్రాంతాలలో కౌమారదశ బాలికల్లో రుతుఆరోగ్యం-అవగాహనపై సర్వే నిర్వహించారు. ఆయన వెంట ఆర్‌బీఎస్ పీఓ డాక్టర్ డి.భాస్కరరావు, తాడికొండ పీహెచ్‌సీ వైద్యులు ఎం.బుద్ధేశ్వరరావు, పైలా అభిలాష్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

26న ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సమావేశం

విజయనగరం: జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జనరల్‌బాడీ సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహణపై చర్చిస్తామన్నారు. సమావేశానికి హాజరయ్యే క్రీడా సంఘాల ప్రతినిధులు తమ ఎఫిలియేషన్ లెటర్స్‌ను ఈ నెల 21వ తేదీలోగా నగరంలోని హోటల్ జీఎస్ఆర్‌లో అందజేయాలని కోరారు.

సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలకు గొట్లాం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: అనంతపురం జిల్లా ఉరవకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు గొట్లాం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో వై.రాజేష్, ఎల్.విజయదుర్గ, కె.సుమతి, ఎ.లేమియా, ఆర్.విజయ, టి.లిఖిత, పి.మానస, సీహెచ్ రమాదేవి, కె.చాందిని ఉన్నారు. వీరిని స్కూల్ హెచ్‌ఎం శ్రీరామాచారి, పీడీ యు.సత్యానంద్ అభినందించారు.

మరో ముందడుగు



పార్వతీపురం మున్సిపల్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బాలికలు

- విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్రప్రభుత్వం
- వృత్తివిద్య బోధనకు చర్యలు
- జిల్లాలో మొదటి విడతలో వృత్తివిద్యకు ఆరు పాఠశాలల ఎంపిక
- చేతివృత్తులను ప్రోత్సహించే దిశగా అడుగులు
- కార్యాచరణ ప్రణాళిక రూపొందించిన జిల్లా విద్యాశాఖ

ఎంపిక చేసిన పాఠశాలలివే..

పాఠశాల	ప్రాంతం
ఏపీటీడబ్ల్యూఆర్	మల్లి
జెడ్పీహెచ్‌ఎస్	బలిజిపేట
ఏపీటీడబ్ల్యూఆర్	పి.కోనవలస
ఏపీటీడబ్ల్యూఆర్	భద్రగిరి
ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్	కురుపాం
ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్	గరుగుబిల్లి

పార్వతీపురంటౌన్:

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. విద్యార్థి కేంద్రంగా బోధన సాగేలా విప్లవాత్మక, వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలల నుంచి బయటకు వెళ్లేటప్పటికి వారి కాళ్లపై వారు నిలబడేలా విద్యాప్రణాళికలు అమలుచేస్తోంది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దుతోంది. ఇందులో భాగంగా తొమ్మిదో తరగతి నుంచే విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బృహత్తర ప్రణాళికను అమలుచేస్తోంది. ఈడీపీ (ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం) కింద ప్రతి శుక్రవారం వారికి తరగతులు నిర్వహిస్తూ యాజమాన్య మెలకువలను నేర్పుతోంది. ఇప్పుడు 6-8 తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వృత్తి విద్యబోధన అమలు చేసేందుకు పార్వతీపురం మన్యం జిల్లాలో ఆరు పాఠశాలలను ఎంపిక చేసింది. విద్యాప్రణాళికను పక్కాగా అమలుచేసేందుకు జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

సన్నద్ధం చేసేది ఇలా..

పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల్లో అధిక శాతం వృత్తి విద్యా కోర్సులను ఎంపిక చేసుకుంటున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర ఉపాధి గ్యారంటీ కోర్సుల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం వృత్తివిద్యా కోర్సుల్లో చేరే విద్యార్థులను ముందస్తుగా సన్నద్ధం చేసే క్రమంలో పాఠశాల స్థాయిలో వృత్తి విద్యబోధన అమలు చేసేందుకు నిర్ణయించింది. పని అనుభవం, ఉత్పాదకత పెంచే దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయడం, వివిధ రకాల వస్తువుల తయారీకి అవసరమైన పరికరాలు, యంత్రాలను గుర్తించడం, వాటిని ఎలా ఉపయోగించాలనేది విద్యార్థులకు నేర్పిస్తోంది. చేతి పనులు చేయటంలో ప్రాథమిక నైపుణ్యాలు పెంపొందించడం, విద్యార్థుల్లో పరస్పర సహకారం, టీమ్ వర్క్‌ను అలవాటు చేస్తోంది.

వృత్తి విద్యకు ప్రోత్సాహం

పాఠశాల స్థాయిలో వృత్తి విద్య అమలుకు తగిన ప్రణాళికలు గణితం, సైన్సు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు సిద్ధం చేస్తారు. పాఠశాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు, ప్రధానంగా చేతివృత్తుల కేంద్రాల సందర్శనకు విద్యార్థులను తీసుకువెళ్తారు. స్థానికంగా చేతివృత్తులు చేసే నిపుణులను పాఠశాలలకు రప్పించి, వారితో విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తారు. చేతివృత్తుల, పరిశ్రమల నిర్వహణ దారులతో ముఖాముఖి ఏర్పాటుచేస్తారు. తద్వారా 9-12 తరగతులు చదివే సమయానికి వృత్తి విద్యలో అనుభవం వచ్చేలా విద్యార్థులను సమాయత్త పర్చడం దీని ఉద్దేశం . గ్రామ, పట్టణ ప్రాంతాల్లో చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు ఇది దోహదపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

వృత్తివిద్య అమలుకు చర్యలు



వృత్తివిద్య అమలుకు పార్వతీపురం మన్యం జిల్లాలో మొదటి విడతలో ఆరు పాఠశాలలను ఎంపిక చేసింది. విద్యార్థి దశనుంచే వృత్తి విద్యను పరిచయం చేసేందుకు ప్రాధాన్యమిస్తోంది. ఇది విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది. విద్యార్థులు ఉపాధి, ఉద్యోగాలు సాధించేందుకు దోహదపడుతుంది.

– ఎస్‌డీవీ రమణ, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

మెనూ అమలులో వ్యత్యాసం చూపొద్దు



సీతంపేట బాలికల ఆశ్రమపాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

- విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించండి
- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని, పక్కాగా మెనూ అమలుచేయాలని శ్రీకాకుళం జిల్లా సీనియర్ సివిల్‌జడ్జి, లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ ఆర్.సన్యాసినాయుడు సూచించారు. సీతంపేట ఏజెన్సీలో ఏడు విద్యాసంస్థలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. తొలుత సీతంపేట బాలుర గిరిజన సంక్షేమ పాఠశాలను సందర్శించి మెనూ అమలు, సరుకుల స్టాక్ రిజిష్టర్లు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. బాలికోన్నత ఆశ్రమపాఠశాలలో మౌలిక వసతులపై విద్యార్థినులను ప్రశ్నించారు. గిరిజన గురుకుల జూనియర్ బాలికల, బాలుర కళాశాలలు, పాఠశాలలు, మినీగురుకులం, కేజీబీవీ, హడ్డుబంగి ఆశ్రమపాఠశాలను సందర్శించారు. అక్కడ వంటకాలను రుచి చూశారు. పల్లీపట్టీలు, అరటి పండ్లు, రాగిమాల్ట్ వంటివి విద్యార్థులకు ఇస్తున్నారా లేదా అనేది అడిగితెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు పాఠశాలలను తనిఖీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ సూర్యనారాయణ, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, ఏఎంఓ పి.కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, ప్రిన్సిపాళ్లు విశ్వనాథం, సూర్యకుమారి, తిరుపతిరాజు, హెచ్‌ఎం ఎ.లిల్లీ రాణి, ఉమావాణి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల తదితరులు పాల్గొన్నారు.

కూలి పనికి వెళ్తూ మృత్యు ఒడికి

- ముఠామేస్త్రి సహా ఇద్దరు దుర్మరణం
- మరో 22 మందికి స్వల్ప గాయాలు
- కూలీలంతా పార్వతీపురం మన్యం జిల్లా వాసులు



ఘటనాస్థలంలో ముఠా మేస్త్రి ఈశ్వరరావు మృతదేహం

హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం)/జియ్యమ్మవలస: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ శివారులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఇద్దరు వలసకూలీలు దుర్మరణం చెందారు. మరి కొద్ది నిమిషాల్లో కూలీలను గమ్యస్థానానికి చేర్చాల్సిన వాహనం వారి పాలిట మృత్యుశకటంగా మారింది. పోలీసుల కథనం మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం బిత్రపాడు గ్రామానికి చెందిన 24 మంది కూలీలు ట్రక్కులో మినపతీత పనుల కోసం గన్నవరం మండలం బూతిమిల్లిపాడుకు బయలుదేరారు. హనుమాన్‌జంక్షన్ శివారులోని వేలేరు క్రాస్‌రోడ్డు వద్ద కూలీలు ప్రయాణిస్తున్న ట్రక్కు అదుపుతప్పి హైవే డివైడర్‌ను ఎక్కి అవతలి వైపు మార్గంలోకి పల్టీలు కొట్టింది. తెల్లవారుజామున నిద్ర మత్తులో ఉన్న కూలీలకు ఏమి జరిగిందో తెలియక భయంతో కేకలు వేశారు. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న ఇతర వాహనదారులు ఈ ప్రమాదాన్ని గుర్తించి పోలీసులు, 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ట్రక్కు క్యాబిన్‌లో కూర్చున్న కూలీల ముఠామేస్త్రి కొప్పర ఈశ్వరరావు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు క్యాబిన్‌లో కూర్చున మరో కూలీ పాడి గౌరిశంకర్ (50) తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని హుటాహుటిన ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే అతను మృతిచెందాడు. మరో 22 మంది కూలీలు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి, ఎస్‌ఐ వాసా వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన వలస కూలీలకు ప్రథమ చికిత్స చేయించారు. హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మొన్ననే గ్రామానికి వచ్చి...



కొప్పర ఈశ్వరరావు (ఫైల్)

మృతుడు ఈశ్వరరావు ఈ నెల 15న బంధువుల పెళ్లికోసం బిత్రపాడు వచ్చాడు. కూలి పనుల కోసం ఇక్కడి కూలీలను తన బొలెరో వాహనంలో తీసుకెళ్లాడు. వెళ్లిన మరుసటి రోజునే మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదం అలముకుంది. ప్రమాదంలో భార్య చిన్నమ్మి కూడా గాయపడింది. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పరిశోధనాత్మక విద్యతో ప్రగతి



విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- పార్వతీపురంలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
- సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి
- కలెక్టర్ నిషాంత్‌కుమార్

ఎంపికైన ప్రాజెక్టులు ఇవే..

అంశం	ఎంపికైన విద్యార్థులు
పర్యావరణహిత వస్తువుల తయారీ	టి.సుష్మ (జెడ్పీ హైస్కూల్, గుమ్మలక్ష్మీపురం), ఎం.అమృత (ప్రభుత్వ బాలికల పాఠశాల, పార్వతీపురం)
ఆరోగ్య, పరిశుభ్రత	పి.గీతాంజలి(జెడ్పీ హైస్కూల్, విక్రాంపురం), సీహెచ్ జ్యోత్స్న (కొత్తవలస జెడ్పీహైస్కూల్)
సాంకేతికత-యాప్	జి.మనోజ్, ఎం.విజయలక్ష్మి (మక్కువ జెడ్పీ హైస్కూల్)
పర్యావరణ మార్పులు	పి.భావణాకృతి, బి.యోగశ్రీ (కొత్తవలస జెడ్పీ హైస్కూల్)
మోడలింగ్ మ్యాథ్‌మెటిక్స్	ఎస్.అక్షితకుమార్ (బందలుప్పి జెడ్పీహైస్కూల్), సీహెచ్ దేవిక (భామిని ఏపీఎం పాఠశాల)

పార్వతీపురం టౌన్: పరిశోధనాత్మక విద్యతో ప్రగతి సాధ్యమని, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. పార్వతీపురంలోని డీవీఎమ్ఎమ్ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సైన్స్, సాంకేతిక రంగాల పట్ల ఆసక్తిని, జిజ్ఞాసను పెంపొందిస్తాయన్నారు. హైస్కూల్ చదువుకునే రోజుల్లో వైజ్ఞానిక ప్రదర్శనల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానం, జోధ్‌పూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ప్రదర్శనలో 4వ స్థానం సాధించానన్నారు. తక్కువ ఖర్చుతో వస్తువుల ఉత్పత్తి చేయడంపై పరిశోధనలు చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రాజెక్టులకు వినియోగించే వస్తువులపై పూర్తిస్థాయి పరిజ్ఞానం అవసరమన్నారు. ప్రాజెక్టుల గురించి వివరించడం వల్ల కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయన్నారు. నేడు విద్యారంగంలో అనేక మార్పులు వచ్చాయని, సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని, యాప్ ద్వారా నూతన విద్యాబోధన చేసేందుకు ఎనిమిదో తరగతి నుంచే ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేస్తోందన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి సైంటిస్టులుగా ఎదగాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రాజెక్టులు

విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రాజెక్టులను కలెక్టర్ పరిశీలించారు. పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఐదు అంశాలపై నిర్వహించిన ప్రదర్శనలో పర్యావరణహిత వస్తువులు తయారీపై 14, ఆరోగ్యం, పరిశుభ్రత అంశాలపై 14, సాంకేతికత-యాప్ అంశంపై 12, పర్యావరణ మార్పులపై 14, మోడలింగ్ మ్యాథ్‌మెటిక్స్‌పై 14, ఇతర అంశాలపై 7 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. విజయవాడలో ఈ నెల 27న నిర్వహించిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు 10 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణ, ఉప జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యార్థులు 150 మంది పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత వీరభద్రపేట

- హోరాహోరీగా సాగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు
- వైభవంగా బంగారమ్మతల్లి తీర్థం

కొత్తవలస: మండలంలోని కాటకాపల్లి గ్రామంలో బంగారమ్మతల్లి తీర్థం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. వైద్యుడు నేమాని విశ్వనాథం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు డాక్టర్ నేమాని నితీష్ ఆర్థిక సహాయంతో నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 16 జట్లు తలపడ్డాయి. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో లీగ్ పద్ధతిలో నిర్వహించిన పోటీల్లో ఎల్.కోట మండలం వీరభద్రపేట జట్టు విజేతగా నిలవగా, విజయనగరం, కొత్తవలస మండలం గులివిందాడ జట్లు ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయి. వీరికి వరుసగా రూ.22వేలు, రూ.12 వేలు, రూ.6వేలు చొప్పున నగదు బహుమతులను డాక్టర్ నితీష్ చేతుల మీదుగా అందజేశారు. రిఫరీగా జిల్లా వాలీబాల్ కోచ్ యు.కృష్ణంరాజు, అంపైర్‌లుగా ప్రకాష్, గణేష్‌లు వ్యవహరించారు.

బంగారమ్మతల్లికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పీతల కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయుకులు కె.వెంకటరావు ఎంపీటీసీ పరిదేశినాయుడు పాల్గొన్నారు.

చలివేంద్రిలో ధాన్యం కొనుగోలు

- కలెక్టర్, ఎస్పీ, జేసీలను కలిసిన రైతులు
- దురుసుగా ప్రవర్తించినందుకు పశ్చాత్తాపం
- రైతులను అక్కున చేర్చుకున్న అధికారులు



వీరఘట్టం మండలం చలివేంద్రి గ్రామ రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జేసీ ఆనంద్

వీరఘట్టం/పార్వతీపురం: మండలంలోని చలివేంద్రి గ్రామంలో రైతుల వద్ద ఉన్న మిగులు ధాన్యం కొనుగోలుకు అధికారులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ జేడీ రాబర్ట్‌పాల్, సివిల్ సప్లై డీఎమ్ దేవుళ్ల నాయక్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రైతులను విడివిడిగా పిలిచి మాట్లాడారు. ఏ రైతు వద్ద ఎన్ని ధాన్యం బస్తాలు ఉన్నాయో ఆరా తీశారు. మొత్తం ధాన్యం తరలింపునకు ఐదు లారీలను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇంత వరకు 2.09 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 30 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు.

పొరపాటు జరిగింది... మన్నించండి

చలివేంద్రి గ్రామంలో గురువారం చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలతో గ్రామానికి చెందిన కొందరు రైతులపై కలెక్టర్ ఆదేశాలతో పోలీసులు కేసు పెట్టిన విషయం విదితమే. తమ తప్పు తెలుసుకున్న రైతులు గ్రామ పెద్దలతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జేసీ ఒ.ఆనంద్‌ను శుక్రవారం కలిశారు. కొందరు రైతులు ఆవేశపడ్డారని, ఇది మా గ్రామ సంస్కృతి, సంప్రదాయం కాదని, భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కావని, తప్పును మన్నించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రైతులను అక్కున చేర్చుకున్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని, రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, వారికి మేలుచేసే ఉద్దేశంతో గ్రామాలకు వచ్చే అధికారులపై దురుసుగా ప్రవర్తించడం తగదన్నారు. అధికారులను మీ కుటుంబ సభ్యులుగా భావించాలన్నారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని వచ్చామని, అందుకే జిల్లాలోని మారుమూల గ్రామాల్లో కూడా పర్యటిస్తున్నామన్నారు. రైతుల ఆవేదన చూశాను.. అర్థం చేసుకున్నానని, అందుకే జిల్లా స్థాయి అధికారులను గ్రామానికి పంపించి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించినట్టు వెల్లడించారు. ప్రతీ గ్రామంలో ఏదో ఒక సమస్య ఉంటుందని, వాటిని పరిష్కరించేందుకు తమ శక్తి మేర కృషి చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేయకుండా ఉంటే మాకు సంతోషమా...అని రైతులను ప్రశ్నించారు. ప్రజలకు ఎక్కువ సేవలు అందించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కలెక్టర్ కోరారు. అందరిపై ఉన్న కేసులను తొలగిస్తామని కలెక్టర్ తెలియజేయడంతో రైతులంతా ఆనందం వ్యక్తంచేశారు. కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

స్పందనలో తెలియజేస్తే సరిపోయేది..

రైతులు తమ సమస్యను స్పందన కార్యక్రమంలో తెలియజేసి ఉంటే సులభంగా పరిష్కారమయ్యేదని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చలివేంద్రి రైతులకు సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కలెక్టర్, ఎస్పీ, జేసీ కార్యాలయాలు ఉన్నాయన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేయడం మన సంప్రదాయం కాదని హితవు పలికారు. గ్రామానికి వచ్చిన కలెక్టర్ వంటి అధికారిని అడ్డుకోవడం పద్ధతికాదన్నారు. మనకు ఆవేదన ఉంటుందని, దానిని చెప్పే తీరు కూడా సరైన విధానంలో ఉండాలని రైతులకు సూచించారు.

క్లుప్తంగా

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లతో ఎస్సై కృష్ణమూర్తి, సిబ్బంది

భోగాపురం: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలి వద్ద ఎస్సై కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టి నాలుగు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. వాహనాతు తనిఖీ చేస్తున్న సమయంలో నాతవలస వేగావతి నది నుంచి భోగాపురం వైపు ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను గుర్తించారు. వాటికి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలు రేపు

విజయనగరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న జిల్లా స్థాయి చెస్‌పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి రింగ్‌రోడ్‌లో గల ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహించే పోటీల్లో అండర్-7,9,11,15 విభాగాల్లో బాల,బాలికలు పాల్గొనవచ్చని తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన మొదటి 15 మంది క్రీడాకారులకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలను ప్రదానం చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ 97033 44488 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఏనుగుల సంచారంతో రైతుల ఆందోళన



కిమ్మి గ్రామంలో చెరకు తోటలో తిష్టవేసిన ఏనుగులు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి-నడుకూరు గ్రామాల సరిహద్దు పొలాల్లో ఏనుగుల గుంపు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తిష్ట వేయడంతో రైతులు, సమీప ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కిమ్మి గ్రామానికి చెందిన రైతులు కోడి తాతాబాబు, వాసు వేసిన చెరుకుతోటలో ఏనుగులు సంచరిస్తూ పంటను నాశనం చేయడంపై ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రికి ఈ ఏనుగులు బయటకు వచ్చే అవకాశం ఉందని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రవికుమార్ తెలిపారు. ఏనుగులను చూసేందుకు ఈ ప్రాంతానికి జనం తండోపతండోలుగా వస్తుండడంతో ఏం జరుగుతుందోనని ఫారెస్టు అధికారులు ఆందోళన చెందుతున్నారు. కవ్వింపు చర్యలు చేపట్టవద్దని అటువైపుగా వచ్చేవారికి విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వతంగా ఏనుగుల తరలింపు

- అటవీశాఖాధికారి ప్రసూన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అటవీశాఖాధికారి ప్రసూన

పార్వతీపురం: ఏనుగులను శాశ్వతంగా ఈప్రాంతంనుంచి తరలించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేస్తామని జిల్లా అటవీశాఖాధికారి జీఏపీ ప్రసూన తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాలో సంచరిస్తున్న ఏనుగుల సమూహాన్ని శాశ్వతంగా జూకు గాని, సంరక్షణ కేంద్రాలకు తరలించాలని కోరుతూ గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస మండలాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖాధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పంట నష్టాలను సకాలంలో చెల్లించాలని, మనుషుల ప్రాణనష్టానికి సంబంధించి పరిహారం రూ.5లక్షలనుంచి రూ.10లక్షలకు పెంచాలని, పంటలను దాచుకోవడానికి కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటుచేయాలని సర్పంచ్‌లు కోరారు. ఈ వినతులపై ఉన్నతాధికారులకు నివేదించి తగు పరిష్కారం చూపిస్తామని అటవీశాఖాధికారి తెలిపారు. కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారులు త్రినాథరావు, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

నిర్వాసితుల సంతోషమే..

ప్రభుత్వానికి తృప్తి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- విమానాశ్రయ నిర్వాసిత కాలనీల్లో పర్యటన



లింగాలవలస నిర్వాసిత కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

భోగాపురం: అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన నిర్వాసితుల సంతోషమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసకుంటోందని, దానిలో భాగంగానే యుద్ధప్రాతిపదికన కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిహారం అందేలా..కాలనీల్లో అన్ని రకాల వసతులు సమకూరేలా పూర్తి స్థాయి పర్యవేక్షణతో చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీవో సూర్యకళ పలువురు జిల్లా అధికారులతో కలిసి ఆమె శుక్రవారం లింగాలవలస కాలనీని సందర్శించి మరడపాలెం, ముడసర్లపేట గ్రామాల ప్రజలతో మాట్లాడారు. అక్కడ కల్పించిన వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి కాసేపు పిల్లలతో ముచ్చటించారు. అనంతరం లింగాలవలస కాలనీలో స్థానికుల సౌకర్యార్థం నిర్మించిన కమ్యూనిటీ భవనాలను, రామమందిరాన్ని సందర్శించారు. ఇంకా మిగిలిన పనులను త్వరితగతిన చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా లింగాలవలస కాలనీలో కొలను నిర్మించి పిల్లలు ఆడుకునే విధంగా పార్కు తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. రేషన్ పంపిణీకిసంబంధించిన డీఎంయూ వాహనాలు కాలనీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ సేవలూ నిత్యం నిర్వాసితులకు అందేలా చర్యలు తీసుకోవాలని, స్థానికంగా పంచాయితీ సెక్రటరీ రోజులో ఒకపూట అందుబాటులో ఉంచాలని డీపీవోకు సూచించారు. వారంలో ఒకరోజు సచివాలయ సిబ్బంది కాలనీల్లో ఉండేలా తాత్కాలికంగా కార్యాలయం ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వాలి

అలాగే ఆర్థిక లావాదేవీలకు సంబంధించి మొబైల్ ఏటీఎం అందుబాటులో ఉంచాలని, వీలుంటే శాశ్వత ఏటీఎం ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉపాధి కల్పనకు సంబంధించి చర్యలు తీసుకోవాలని డ్వామా అధికారులకు సూచించారు. స్కిల్ డెవల్‌మెంట్ విభాగంలో స్థానిక యువతకు ప్రత్యేక శిక్షణ అందజేయాలని స్కిల్ డెవల్‌మెంట్ అధికారిని ఆదేశించారు. అనంతరం గూడెపువలసలో పర్యటించిన కలెక్టర్ అక్కడ కల్పించిన మౌలిక వసతులు, నిర్మించిన భవనాలను పరిశీలించారు. ముందుగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించి స్థానికంగా ఉన్న వారందరికీ ఫైలేరియాకు సంబంధించిన మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. కాలనీ సందర్శనలో భాగంగా నిర్వాసితులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను, స్థానిక తహసీల్దార్‌కు సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీవో సూర్యకళ, డీపీవో నిర్మలకుమారి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఐసీడీఎస్, విద్యుత్ శాఖ, ఉపాధి హామీ పథకం విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు పక్కాగా చేయాలి

- కలెక్టర్ నిషాంత్ కుమార్



జమదాలలో సిబ్బందితో చర్చిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



గదబవలసకు నడకప్రయాణం చేస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: రైతు పండించే పంటలకు ఇ-క్రాప్ నమోదు పక్కాగా చేయాల్సిందేనని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తేల్చిచెప్పారు. ఈ మేరకు మండలంలోని జమదాల గ్రామ రెవెన్యూ పరిధిలో రైతు పండించే పంటకు సూపర్‌వైజరీ చెక్‌ను శుక్రవారం ఆయన నిర్వహించారు. రైతు పండించిన జొన్న పంట వద్దకు వెళ్లి ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నది, ఇ-క్రాప్ నమోదు జరిగిందా? లేదా? సాగు రైతు వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. పంట సాగు వివరాలను రైతు దాసరి ఆదినారాయణను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో రైతులు చిరుధాన్యాల పంటలు సాగుచేస్తున్నారా, కిట్ల పంపిణీ విషయాలపై మండల వ్యవసాయధికారి ఆర్.రేఖను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలు రైతులకు వర్తించేందుకు శతశాతం ఇ- క్రాప్ నమోదు జరగాలని స్పష్టం చేశారు. ఏ ఒక్క రైతూ నష్టపోకుండా వ్యవసాయ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలన

మండలంలోని గదబవలస గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆకస్మికంగా పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎంత మేరకు పొటాషియం, సల్ఫర్, యూరియా పంపిణీ చేసింది పరిశీలించారు. పాడి రైతులకు పంపిణీ చేసే టీఎంఆర్ నిల్వలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శివన్నారాయణ, ఎంపీడీఓ షేక్ మహమ్మద్ ఆకీబ్ జావేద్, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.గిరిజ, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా యూనిట్లను ప్రోత్సహించాలి

- కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఫిష్ ఆంధ్ర యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందిస్తున్నందున ఈ రంగంలో ఆసక్తి ఉన్న యువతను, మహిళలను ప్రోత్సహించాలని కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. వండిన చేపల కూరలు మార్కెటింగ్ చేసేందుకు స్టాళ్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను, కూడళ్లను గుర్తించాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఫిష్, డైరీ డెవలప్‌మెంట్ యూనిట్ల లక్ష్యాలపై సమీక్షించారు. విద్యార్హతలు లేనందున ఆసక్తిగల వారికి అవగాహన కలిగించి ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో యూనిట్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఎఫ్‌పీఓలు మండలాల్లో జరిగే జేఎంఎల్‌బీసీ సమావేశాలకు తప్పక హాజరుకావాలని అలా హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలని ఫిషరీస్ డీడీ నిర్మలదేవిని ఆదేశించారు. ఎయిర్‌పోర్టు ఆర్ అండ్‌ఆర్ కాలనీలలో డిగ్రీ పాస్ అయిన వారిని గుర్తించి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వాలని ఆ శాఖ అధికారి గోవిందరావుకు సూచించారు. పోలిపల్లిలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తే స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచవచ్చన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను నెలకొల్పేలా చూడాలని ఆ శాఖ జేడీ డాక్టర్ రమణను ఆదేశించారు. కొత్తవలసలో ఉన్న మాంగో జెల్లీని ఆకర్షణీయమైన పాకింగ్ చేయించి జీ-20 సదస్సుకు సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తికి సూచించారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, ఎల్‌డీఎం కె.శ్రీనివాసరావు, మెప్మా పీడీ సుధాకరరావు, హార్టికల్చర్ డీడీ జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృత అవశేషాలపై క్లూస్ టీమ్ పరిశీలన



మృతురాలి అవశేషాలను ఆస్పత్రిలో పరిశీలిస్తున్న క్లూస్ టీం

భామిని: మండలంలో సంచలనం రేపిన మహిళ మృత అవశేషాల లభ్యతపై వివరాలు సేకరించడానికి బత్తిలి ఎస్సై వై.అమ్మాన్‌రావు ఆధ్వర్యంలో క్లూస్ టీం శుక్రవారం రంగంలోకి దిగింది. ఈ మేరకు భామిని మండలం కొరమ సమీపంలో గురువారం గుర్తించిన మహిళ మృతదేహం ఆనవాళ్లను పరిశీలించి ఆధారాలు సేకరించారు. పెద్దదిమిలి వీఆర్‌ఓ పి.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలంలో అవసరమైన వివరాలు తీసుకున్నారు. మృతురాలు ఎవరు? ఎలా మృతి చెందింది? హత్యా? ఆత్మహత్యా? అనే విషయాలు తెలుసుకునేందుకు క్లూస్‌టీం శ్రమించింది. అయితే వేరే చోట హత్య చేసిన కొన్నాళ్లకు ఇక్కడికి తెచ్చి పడవేశారనే అనుమానాలు ఎక్కువగా రేగుతున్నాయి. పాలకొండ ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచిన అవశేషాలను క్లూస్ టీమ్ పరిశీలన అనంతరం డీఎన్‌ఏ పరీక్షకు విజయవాడ పంపుతున్నట్లు ఎస్సై అమ్మాన్‌రావు తెలిపారు. మృతురాలు చీర, వయస్సు, జుత్తును పరిశీలించి శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం మెట్టూరు బిట్-2కు చెందిన వివాహిత రంజితగా భావిస్తున్నారు. గత నెల-1 తేదీన భామిని మండలం పెద్దదిమిలి గ్రామానికి వచ్చి బంధువుల ఇంటికి వచ్చి తిరిగివెళ్లే సమయంలో ఆమె అదృశ్యమైనట్లు భర్త ఫిర్యాదు చేసి ఉన్నాడు. రంజిత వచ్చిన పెద్దదిమిలి గ్రామానికి అవశేషాలు లభించిన కొరమ గ్రామానికి మధ్య మూడు కిలోమీటర్ల దూరం కావడంతో అనుమానాలు బలపడుతున్నాయి.

వాలీబాల్ విజేత విజయనగరం



వాలీబాల్ బాలుర పోటీల్లో విజేత విజయనగరం జట్టు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14వతేదీ నుంచి 16 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులతో వాలీబాల్ అండర్-14 బాల బాలికల రాష్ట్ర జట్టు వివరాలను ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు శుక్రవారం ప్రకటించారు. కార్యక్రమంలో పోటీల రాష్ట్ర పరిశీలకులు టీవీఎస్.రంగారావు, ఎం.ఎస్.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

రాజాం సిటీ: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎస్సై వై.రవికిరణ్‌తో పాటు సిబ్బంది మండల పరిధిలోని చీకటిపేట జంక్షన్ వద్ద వాహనతనిఖీలు చేసుండగా ఎం.జె వలస వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు వస్తుండడంతో ఆపి వారి దగ్గరున్న సంచిని పరిశీలించగా 310 గ్రాముల గంజాయి దొరికింది. దీంతో వారిపై కేసు నమోదుచేసి పాలకొండ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

అబద్ధపు ప్రచారం

- పచ్చమీడియా ప్రచారాన్ని ఖండించిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ పచ్చమీడియా అబద్ధపు ప్రచారాలు సాగిస్తోందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య విమర్శించారు. గజపతినగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు 40 ఎకరాల భూమి ఉందని, అందులో ఎక్కువగా ఉన్నవి లిటిగేషన్ భూములేనంటూ పచ్చమీడియా చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టారు. పచ్చమీడియా ప్రతినిధులు తారసపడితే భూ యజమానులైన రైతులే బుద్ధిచెబుతారన్నారు. తప్పుడు వార్తలతో ప్రజల్లోని తమ ఇమేజ్‌ను తగ్గించలేరన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ప్రజలకు ఏ నాయకుడు మంచి చేస్తారో తెలుసని చెప్పారు. బైపాస్ రోడ్డు మంజూరుచేసి ఈ ప్రాంత ప్రజల రాకపోకలు కష్టాలు తొలగిస్తే తప్పుడు కథనాలు ప్రచురించడం ఎంతవరకు సమంజసమన్నారు. బైపాస్ రోడ్డులో తమ భూమిని కూడా కొంత కోల్పోయినట్టు చెప్పారు. గజపతినగరంలో 30 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకు కృషిచేసినది ఎవరో ప్రజలకు తెలునన్నారు. గజపతినగరంలో ఉద్యోగులందరూ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, వారి విధులపై అసత్యవార్తలు ప్రచురించడం తగదన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు గారతవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, జేసీఎస్ కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, ఎం.గుమడాం సర్పంచ్ బొడ్డు రాంబాబు ఉన్నారు.

చెరువులో పడి వలంటీర్ మృతి



సింహాచలం (ఫైల్)



మృతిచెందిన బుధహెబందరం

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జవలస పంచాయతీ పరిధి గున్న తోటవలసకు చెందిన వలంటీర్ కంటు సింహాచలం(38) చెరువులో పడి మృతిచెందాడు. ఈ ఘటనపై ఎస్సై జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 11న బొబ్బిలిలోని సచివాలయ ఉద్యోగి వివాహవేడుకకు హాజరైన సింహాచలం తరువాత అదృశ్యమయ్యాడు. దీనిపై కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బొబ్బిలి పట్టణంలోని కోటిచెరువు కాలువలో ఓ వ్యక్తిమృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి పరిశీలించి ఆ మృతదేహాన్ని వలంటీర్ సింహాచలంగా గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహానికి సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించారు. వలంటీర్ సింహాచలం ప్రమాదవశాత్తు చెరువులో పడిమృతిచెందినట్లు భావిస్తున్నారు. మృతుడికి భార్య శోభారాణి, కుమార్తె శ్రీవల్లి, కుమారుడు లోహిత్‌కుమార్‌లు ఉన్నారు. కుటుబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండ ప్రాంతంలో మృతదేహం లభ్యం

కురుపాం: మండలంలోని కరండిగూడ-సొబ్బాకొండల్లో మృతదేహం ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న ఎల్విన్‌పేట సీఐ బి.సత్యనారాయణ, నీలకంఠాపురం ఇన్‌చార్జ్ ఎస్సై సీహెచ్ ప్రసాద్ సిబ్బంది కలిసి గురువారం రాత్రి సంఘటనా స్థలానికి వెళ్లారు. ఈ సందర్భంగా స్థానికులను ఆరా తీయగా ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణం పనుల నిమిత్తం జార్ఖండ్ రాష్ట్రం నుంచి ఇక్కడికి ఆ వ్యక్తి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి దగ్గర ఉన్న ఆధార్ కార్డు ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బుధహెబందరం (51)గా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్టోన్ క్రషర్‌లో కార్మికుడి మృతి



ప్రమాదంలో మృతిచెందిన సూర్యనారాయణ

కురుపాం: స్థానిక బాలాజీ స్టోన్‌క్రషర్‌లో జరిగిన ప్రమాదంలో కార్మికుడు ఆర్.సూర్యనారాయణ (55) మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం కొంకిడివరం గ్రామానికి చెందిన ఆర్.సూర్యనారాయణ(55) సుదీర్ఘకాలంగా క్రషర్‌లో లోడింగ్ చేసే చోట యూనిట్ గేజ్ చూస్తున్నాడు. రోజు లాగానే పనిచేస్తుండగా వాహనానికి లోడింగ్ యంత్రం మధ్యలో నలిగిపోయి నేలకూలిపోయాడు. అది గమనించిన క్రషర్ సిబ్బంది హుటాహుటిన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. కురుపాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఎస్సై ఉద్యోగాల రాతపరీక్షకు పటిష్ట భద్రత

విజయనగరం క్రైమ్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగ నియమకాలకు సంబంధించి ఈ నెల 19న నిర్వహిస్తున్న ప్రాథమిక రాతపరీక్షకు అన్ని భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 10 కేంద్రాల్లో పేపర్-1 పరీక్షను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, పేపర్-2 పరీక్షను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే సంబంధిత పోలీసు అధికారులు పరీక్షా కేంద్రాలను సందర్శించి, స్ట్రాంగ్ రూంలు, భద్రత, సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారని పేర్కొన్నారు. ప్రాథమిక రాత పరీక్ష ప్రారంభానికి గంట ముందు నుంచి అభ్యర్థులను పరీక్షించి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. రాత పరీక్ష ప్రారంభమైన తర్వాత ఎవరినీ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. హాల్ టికెట్స్‌లో సూచించిన నియమ, నిబంధనలను అభ్యర్థులు క్షుణ్ణంగా చదువుకుని, పాటించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, డిజిటల్ వాచ్‌లు, బ్లూటూత్, కాలిక్యులేటర్లు, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించమని స్పష్టం చేశారు.

హెల్ప్‌డెస్క్‌లు

అభ్యర్థుల సౌలభ్యం కోసం వారికి దిశానిర్దేశం చేసేందుకు రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్కులు ఏర్పాటుచేస్తామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ లను కూడా నియమించామన్నారు. జేఎన్‌టీయూ పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు వాహనాల సౌకర్యం లేనందున పోలీసుశాఖ ప్రత్యేకంగా రెండు వాహనాలు ఏర్పాటుచేసిందని పేర్కొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి రెండు రోజుల పాటు జాతర



రామక్షేత్రం చుట్టూ టెంట్ల ఏర్పాటు



ఉమాసదాశివాలయంలో పుష్పాలంకరణ

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ రామస్వామి దేవస్థానంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి దాదాపు లక్షమందికి పైగానే భక్తులు ఈ జాతరకు రానున్నారని అంచనా. దేవస్థానం, ఇతర శాఖల సిబ్బంది ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రామాలయం, శివాలయం వద్ద టెంట్లు, ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. అలాగే రామకోనేరు వద్ద భక్తుల స్నానాలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక సదుపాయం కల్పించారు. యాత్రికులను కనువిందు చేసేందుకు ఇప్పటికే పలు రకాల సర్కస్ కేంద్రాలను నిర్వాహకులు ఇక్కడికి చేరుకున్నారు. విజయనగరం వైపు నుంచి వచ్చే భక్తులకు సీతారామునిపేట వద్ద, రణస్థలం నుంచి వచ్చే భక్తులకు దన్నానపేట జంక్షన్ వద్ద పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు 300 మంది పోలీసులు విధులు నిర్వర్తించనున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు తమ సేవలను అందించనున్నాయి. శాశ్వత కేశఖండన శాల వద్ద పోలీస్ కంట్రోల్ రూమ్ పెట్టారు. ప్రథమ చికిత్స అందించేందుకు గాను నెల్లిమర్ల, కొండవెలగాడ వైద్య సిబ్బంది వైద్య శిబిరాల్లో సేవలందిస్తారు. ఉమా సదా శివాలయంతో పాటు రామాలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. శనివారం వేకువ జాము నుంచి రణస్థలం, విజయనగరం కేంద్రాల నుంచి ఆర్టీసీ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. బోడికొండ సందర్శనకు వెళ్లే భక్తులు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిక బోర్డులను అనుసరించి వెళ్లాలని దేవదాయశాఖతో పాటు పోలీస్ యంత్రాంగం కోరుతున్నాయి.

శివాలయంలో ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి పర్వదినాన శివాలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. బ్రహ్మ ముహూర్త కాలంలో గణపతి పూజ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కామాక్షి అమ్మవారికి హారతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు గణపతి పూజ, మహాన్యాస పారాయణాలు జరిపించి 11 రకాల పండ్ల రసాలు, భస్మం, చందనం, హరిద్ర కుంకుమ, సుగంధ ద్రవ్యాలు, నారికేళ జలంతో శివుడికి అభిషేకాలు జరిపిస్తారు. రాత్రి 12 గంటలకు మహా లింగోద్భవ సమయంలో స్వామికి విభూది సమర్పిస్తారు. శనిత్రయోదశి కూడా కలిసి రావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తే అవకాశం ఉంది.